ఎండమావులు

వెంపటి నాగభూషణం

1909లో మచిలీపట్టణములో పుట్టిన నాగభూషణం 1932లో బికనీర్ మహారాజా వారి కళాశాలలో ఎం.ఎ. చదివారు. తర్వాత పూనే వాడియా కాలేజిలో ఆంగ్లోపన్యాసకులుగా చేరారు. ఆంగ్లంలో అనేక గద్య పద్య రచనలు చేసి ఆంగ్లేయులను సైతం అబ్బురపరిచారు. దాదాపు 200 కథలు తెలుగులో రాశారు. "ముత్యాలశాల" అనే కథా సంకలనం, పద్మావళి పరిషత్తు ప్రచురితాలు. వీరి కథలు కొన్ని హిందీలోకి తర్జుమా అయినాయి. పూజ పల్లకి, కింకిణీ మాల, నెమలి పింఛం వీరి అముద్రిత రచనలు. ఈ కథ రచనా కాలం 1938.

కుహుఁ... కుహుఁ... కు...హూఁ... ... ...

–కలకంఠ వధూకలకంఠ రవానుకారి... కాకలీ ధ్వని... ఆ సుషుప్తి ముద్రాలంకారమూర్తిని... ఉహుఁ కదప లేదు.

ఓ... మదవతీ నవమన్మథ మోహనరూపా!... సంతత రసానంద సారస్వత కేళీలోలా!...

–అలా... ప్రబంధకవుల రచనా చమత్కృతులను... తాత్కాలికంగా ఉపసంహరించి... మృదుమధుర కంఠంతో... కొంచెం అధునాతన భావకవిత్వపు మజాతో... ప్రబోధించే సరికి:

నాయిక పుణ్యఫలం... స్వల్పంగా ఫలించి, అతడు... కొంచెం అటునిటు మసలి...

–తిరిగి నిద్దురలో కలసి మెలసిపోయి...

ఇక... మామూలు మేలుకొలుపులతో ప్రయోజనం లేదని... పాన్పును దరియబోయి, సిల్కు చతుష్కిని పక్కకు తొలగించి, స్వీయబాహువల్లరీ కుశల వ్యాపార, పారీణతను... ఆతనికి చవి చూపి ఒక వైపునుంచి ఒక వైపుకు ఊగించి... రెండు చెంపల మీదను, నెన్నొసటను చుంబనాలంకారములను... తొరహత్తుగా ప్రసాదించ:

ఆ... రసికావతంసుడు... తమాయించుకో లేక, జాగరణావస్థలోకి ట్రాన్సుఫరు అయి... అరవిచ్చిన కన్నుదోయితో– తన మీదకు ఒరగిలి... వైతాళిక విధిని నెరవేర్చి... చిరునవ్వు చలువలు చిలుకరిస్తూన్న... గృహిణిని విలోకించి...

అప్పటికి, పూర్తిగా సుస్తోత్థితుడై... ఆమెను నయగారపు మాటలతో ఊరడిస్తూ... మెల్లమెల్లగా... ఆమె గండద్వితయముమీద లేగులాబీలను సృష్టించి, ... కోమలస్మిత రుచులను వెలువరిస్తూ... కొంచెం దూకుడు గానే... మంచం విడిచి...

... భర్త విధించినదే అయినా, తనకూ సరదా నిచ్చేపనే కాబట్టి... ఆ దైనందిన రసోపేత ధర్మ నిర్వహణానంతరం... ఆమె, ... శయ్యా మందిరం వీడి, ... వెళ్ళలేక, ... వెళ్ళ...లేక... వెళ్ళినా... అతడు మాత్రం... అక్కడే, నిలువుటద్దం ముందు నిలువబడి, ...వన్నె చిన్నెలు మధురభావనలో స్మరించుకుని, ... కులాసాగా క్రాపింగ్ సవరించుకుని, రెండు... మూడు... మారులు... ఆవులించి, – ఈలతో... ఏదో

ఆణిముత్యాలు

ఆలపిస్తూ, ... ఈ జగతిలో వాడై పోయినాడు.

❖ ❖ ❖

కవి ననుకునేవాడు గనుక... తత్కారణంగా విధివతు... కాఫీగత ప్రాణి గనుక, ఆ భూలోక సుధను... పూర్తిగా సేవించి రోజ్‌వుడ్ మేజా ముందు... రాకింగ్ చైర్‌లో సుఖాసీనుడై – శ్వేతకాష్ఠోద్భూత ధవళధూమ రేఖా శిల్పాన్ని... ఏకాగ్రతతో పరామర్శిస్తూ, ... భావ జగతిని విహరించడానికి రెక్కలు విప్పుకొనబోతూ, ఏదో అనూహ్యపు టూహాంచలముల నొరసుకొంటూ... మై మరచి, ఉపాసన వైఖరిని... ఉండగా...

"చూశారా... ఎంత అన్యాయమో...!"

–అధిష్ఠించిన ఉన్నత శిఖరాల మీదకు... ఆమె

మాటలు వినబడకపోయినా, ... ఎదురుగా నిలిచిన ఆమెను... చూడనట్టుగా నటించలేక... కృషి చేసి అలవరచుకున్న... కలల చూపులతో...

"ఏమిటి..." అనే అర్థం... స్ఫురింపజేశాడు:

వళావళితో, ...తూలుతూ... తొట్రుతూ... ఆమె అతని పరాకును మన్నించకుండానే... దగ్గరకు వచ్చి... చేతులో ఉన్న "మాగ్‌జీన్'ను... పుటలు త్రిప్పుతూ...

"చూశారా... అన్యాయం..." - అని రెట్టించింది:

తప్పనిసరిగా... అతడు, మొహం ఆమె వైపుకు త్రిప్పి:

"ఏం... "కిరణావళి"... వచ్చిందా?..." అన్నాడు.

"ఆఁ... వచ్చింది, ఎలాగైతేనేం. ఎందుకూ?... మీ గీతాలు గాని... కథ గాని అచ్చుపడలేదు..."

కలిగిన ఆశ్చర్యాన్ని... అంతగా పైకి కనబడనీ కుండా... "మాగజీన్"ను అందుకుని... అటు ఇటు త్రిప్పి చూచి... ఆమె అన్నది యధార్థమేనని రూఢి చేసుకుని... కొంచెం దిగులుతో మూగవోవగా...

"ఏం... లాభం మళ్ళీ... పైకి అందరూ స్నేహితులే. బ్రతిమాలి... మరీ బ్రతిమాలి కాదూ... మీ రచనలను తీసుకు వెళ్ళారని... చెప్పారు మీరు?... మొదటి సంచిక కదా... మీ కృతులకు గౌరవస్థాన మిచ్చి ప్రకటించ కూడదూ... అంత మాత్రం..."

"...ఈ మాత్రానికే..." - చిన్నబుచ్చుకున్నాడు...

"నేను... అనడంలేదు మీతో, ... అడపాదడపా... మీ సాహితీ సమీహలు... వట్టి... ఎండమావులని..."

అతడు... తొణకలేదు...

పరస్పర సంవీక్షణదీక్షలో... అయిదు నిమిషములు: - ఆ క్రొత్త మాసపత్రికను... ఆమె గదిమూలకు విసిరివేసి... ఇక అక్కడ ఒక క్షణమైనా... నిలువలేదు.

అతడు... ఆ ధూతమనస్కుడైన అతడు... స్థాయి చిక్కించుకునేటందుకు... మరొక సిగరెట్ కన్యను చేరదీసి... భావసమాధి.

❖ ❖ ❖

రాత్రి: -

"చూశారా... ఎంత బాగున్నదో... వెదర్..."

ఒయ్యారంగా... తూగుటుయ్యలలో కూర్చుని... తమలపాకుల చిలకలు తయారు చేస్తోంది. - కిటికీలో నుంచి... ఆకాశం మీద పేరుకుంటూన్న... మబ్బు దొంతరలను... చూస్తూ:

"చూశారండీ... మేఘైర్మేదుర మంబరం?... మీరే కనుక... నెమలి అయితే... పింఛం విప్పి నృత్యం చెయ్యకపోయారా... ఏం... కాదూ?...

అతడికి వినపడలేదు: వినిపించుకునే ధోరణిలో లేడు... తల వంచుకుని... అదే పనిగా అక్షరముల సహాయంతో... భావమణిమాలను పోహణిస్తున్నాడు:- సాహితీ సౌధ చంద్రశాలను... కవితాపల్లకిని... ఇంద్ర జాలికాంగుళీయములతో... స్పృశించి... కవితా యోగమున... సాయుజ్యము నందుతూన్న... ఆరని తృష్ణాళువును... మేనక అంతటి వన్నెలాడి కూడా... ఆ సమయంలో... భంగపాటొనర్చలేక... మరలి పోయేది...

మెరుపులు... వెనువెంటనే... ఉరుములు... పిడుగులు... - ఫెళఫెళా... టపటపా... ఆకాశం చిల్లిపడి నట్టుగా... ఎడతెరపీ లేకుండా... చినుకులు. హోరున పెనుగాలి...

ఆ... జవరాలు, పూర్తిగా రెచ్చిపోయి... ఇక ఎద లోపలి తలపాపలేక... లేచి వెళ్ళి... కిటికీ తలుపులు బంధించి... అతడు కూర్చున్న కుర్చీ చేతిపైన వ్రాలి...

అతడు... చూడడు:

ఆమె... ఆగలేకపోయింది. దభాలున... అతని ముఖాన్ని వక్షోప బృంహణక్రమంతో...

"ఏమండీ, పైకి పోదాం. రారూ? పొద్దు పోయింది..." అతడు... తప్పించుకోడానికి ప్రయత్నిం చాడు... ప్రత్యుత్తర మీయకుండానే.

ఆమె... పెనవేసుకోబోయింది: కాని... అతడే గెలి చాడు. పట్టు విడిపించుకుని... తిరిగీ వ్రాతలోకి దిగాడు...

ఆమెకు... ఆగ్రహం వచ్చింది: కాని... అనునయా లాపాలతో... కార్యం నెగ్గించుకోవాలని:

"నిద్దర... వస్తోందండీ: రారూ..."

-రాననే సూచనగా... అతను తల త్రిప్పాడు.

"అయితే... స్విచ్ నొక్కి... లైట్ ఆర్పివేస్తాను..."

"మారాం చేయక... వెళ్ళి పడుకో..."

"ఒంటరిగానేనా?..."

"ఊఁ... ..."

కుటుంబం

కలము - భర్త
కాగితము - భార్య
రెంటి కలయిక
అక్షరాలు - వారి పిల్లలు

-జరాసంధనామ

ఆమె... ఆపాదమస్తకము శీతలించి... తన ఎత్తు నెగ్గలేదు గదా అని నిస్పృహ చెంది... ప్రయోజనం లేదని నిర్ధారణ చేసుకుని... ఆతన్ని వదలి వెళ్ళలేక... వెళ్ళలేక... వెళ్ళి...పో...యిం...ది.

-చలించకుండా... వ్రాస్తూనే ఉన్నాడు: కవి... కథకుడు... విమర్శకుడు- అయిన ఆతని ఆదర్శ

పెరటి చెట్టు

అమ్మ చేత్తో ఏమిచ్చినా
అంతా మంచి జరుగుతుందనే నమ్మకం!
వీధి బడికెళ్ళే రోజుల్లో
అర్ధణానో... అణానో మెల్లగా చేతిలో వుంచేది
హైస్కూలు కెళ్ళేటప్పుడో...
ఆపై కాలేజీకి వెళుతున్నపుడో
అయిదో పదో అదే చేత్తో యిచ్చేది.
ఉద్యోగానికి పోయేటప్పుడు గాని
ఇల్లు కట్టుకుందామనుకున్నప్పుడూ
అమ్మే... ఆ చేత్తోనే
అవసరానికి వస్తాయని చేతి బంగారు గాజులు
తీసి యిచ్చేది
ఇప్పుడో ఇంటి వాణ్ణయ్యాను
ముగ్గురు బిడ్డల తండ్రినయ్యాను
ఆమె చేతి చలవతో నాకన్నీ సమకూరాయి
అయినా ఆమె అలవాటు మారలేదు!
నా చేతిలో పెట్టినట్టే...
ఇప్పటికీ నా బిడ్డల చేతుల్లోనూ
తనకున్నది పెట్టడమే ఆమెకి తెలిసింది.
ఎప్పుడూ ఇవ్వడమే తెలిసిన అమ్మ
ఎన్నడూ మానుండి ఏమీ ఆశించలేదు!
ఒక్క మంచి మాట... ఓర్పుతో కూడిన పలక
రింపు తప్ప!
ఎప్పుడూ తనదే పై చేయిగా వుండే అమ్మ
ఎన్నడూ చెయ్యిచాచి అడిగింది లేదు!
ఒక్క ఓదార్పు స్పర్శ... మలిసంజెలో మా చేతి
ఆసరా తప్ప!
ఎవరెన్ని వైపుల నుండి కొమ్మల్లా తెంపుకు
పోయినా
మళ్ళీ మళ్ళీ చిగురించి కళకళలాడే
మా పెరటి కరివేపాకు చెట్టు మా అమ్మ

-కె. మోహనరావు

ములు... ఆలోచనలు... పోకడలు... ఇతరులకు అంతగా... సులభ గ్రాహ్యములు కావు:

...బాహ్యాంతర ప్రవృత్తులలో... నిబిడీకృతమై ఉన్న... విశిష్ట సౌందర్యాన్ని అభివర్ణించి... తెనుగు తీగలు తీరు తియ్యములను పొంది... పూచి, పరిమళించేటట్టుగా దోహదం చేసి,-

... ఆత్మ సాక్షాత్కారం కోసం... ఏకావరణ జన్యములే అయిన... సౌందర్య రసానందములతో అక్షినిమీలన కేళి సాగిస్తూ... ఆనందగీతమును పాడుతూ... ఆనందసూత్రమును అల్లుతూ... ఆనంద మూర్తిని చిత్రిస్తూ:... తానొక అక్షరరమ్య శిల్పిగా... భావుకుడుగా...

అదే ఆతని ఆశయము. ఏది ఎటులైనను... ఎటు పోయిననూ... సరే. తన కోర్కెలు... తన పద్ధతులు... సమకాలీనుల సమాదరణకు పాత్రము కాకపోయి నప్పటికీ... ఆతనికి... అలమట లేదు... కాని, ... ఏమో? ... మానవత్వము అంత పూర్తిగా మరుగుపడి పోతుందా?...

❖ ❖ ❖

టీ-సిప్ చేస్తున్నారు... ఎదురెదురుగా కూర్చుని:

ఆతడే... ముందు పలుకరించాడు:

"మరి...?"

"ఊఁ...."

"పై శుక్రవారమే... కాదూ"

"ఏమిటి...?"

"నీ పుట్టిన రోజు"

"ఏమో... ఎప్పుడు అయితే ఏం?..."

"అబ్బ... ఎప్పుడూ... అలుకేనా...?"

"తమరు చేసేవి.. అలా ఉన్నవి..."

చెంగున గంతువేసి... లేచి, ఆమెను చేతులలోకి తీసుకున్నాడు...

అబ్బ... ఉండండి... నొక్కుకుంటోంది... లోలకు..."

"ఉహుఁ... చెప్పదలచుకున్నది... చెప్పి గాని..."

"చెప్పండి... మరి..."

"నీ... పుట్టినరోజుకు... ప్రెజంటు..."

"మీ... యిష్టం..."

"శర్మచేత... నీ బొమ్మ పెద్దదిగా గీయించి..."

"అవును... అలా చెప్పడం... ఎన్నోమారో..."

"ఈ మారు... తప్పదు. అతనికి కబురంపుతాను... సామగ్రితో సహా రమ్మని... ఇంకా పదిహేను రోజు

లున్నది: - చక్కగా, శుక్రవారం నాటికి తయారు అవుతుంది..."

"... చూస్తానుగా..."

"మరి... మరి... నాకేమి... ఇస్తావు..."

"ఎందుకూ... రెట్టించడం? నేను ఇస్తాననేవి... ఏమీ మీకు పనికిరావుగా..."

"అలా... జరిగేది... అప్పుడప్పుడేగా..."

"మీరు... వ్రాతలో... భవిష్యద్భావ స్వప్నానంద పిపాసలో... మగ్నులై ఉన్నప్పుడు..."

"అది... నిజం. అలాటి అమృత ముహూర్తాలలో... చతుర్ముఖుడు వచ్చి... చెంత నిలబడినా... చలించను..."

"ఉహుఁ అదీగొప్పే. అవునవును... ఎవరి పిచ్చి... ఎందుకో... ఆ వ్రాతలన్నీ. పట్టుమని పది అయినా... ప్రపంచం ముఖాన్ని చూడలేదు..."

"ఆలాటి... కీర్తికాంక్ష నాకు ఉంటేగా..."

"పోనీ, వాటిని... ఆదరించినవాళ్ళు... ఎవరైనా ఉన్నారా... చెప్పండి..."

"ఇతరులు... మెచ్చుకోవాలని కాదు... నేను రచయితను... అయినది..."

"ఈ దంభనామనము కేం?... తగినంతగా... పేరు ప్రఖ్యాతులు రాలేదని... మీరు అనుభవించే... వ్యథాఖిన్నత... మీ చూపుల్లో... నాకు కన్పడదనుకున్నారా... అప్పుడప్పుడు..."

"...పొరపాటు... నా సాహితీ శ్రమ అంతా... కేవలం... ఆత్మానందం కోసం..."

"అందుకు... అయితే... ఇది ఒకటేనా మార్గం..."

"ఎవరి... రససిద్ధి వారిది..."

"ఉహుఁ... అందుకనే కాబోలు... కథలలోను, ఖండకావ్యాలలోను... నిరాటంకంగా... చక్కని చుక్కలతోను... సొగసు కోర్కులతోను... సయ్యాటలాడుతూన్న మీరు... నాలోని రసికత్వానికి నికషంగా ఉండలేక... జీవన మాధురీ రుచులను... దూరం చేసుకుని..."

అతడు... నొచ్చుకున్నాడు. ఆమె... అది గమనించి కూడా:

"అందుకనే... మన ఉభయుల పంథాలూ... భిన్నములవుతూన్నవని... సందేహం కలుగుతూ ఉన్నది: ముందు... ముందు... ఇంకా... మరీ, మరీ దూరం అయిపోతామేమో!... అతనికి... ఏమీ తోచినది కాదు. లేని... చిరునవ్వును... తెచ్చిపెట్టుకుని... ఏదో... అనబోతుండగా:

బంయ్... బంయ్... బంయ్...

హారన్... వినబడ్డది. కారులో వచ్చిన మిత్రుణ్ణి... ఎదురుగా వెళ్ళి గౌరవించే... నెపంమీద...

ఆ నాటకం మానేసి... బయటకు వచ్చేశాడు...

❖ ❖ ❖

శుక్రవారం... ...

పున్నమి వెన్నెల... కళలు చిమ్ముతూన్నది: అతడు... అసహజమైన అప్రమత్తతతో, హుషార్‌తో... అంగలో మెట్లన్నీ లంఘించి... లోపలకు వచ్చి... స్టాండుమీద ఉత్తరీయాన్ని ఉచ్చువదలి... డ్రాయింగ్ రూమ్ తలుపును అరవిరియించడానికి... తళతళలాడుతూన్న గుబ్బను తిప్పి... నెట్టబోతూ...

మాటలు వింతగా వినబడగా... ఆలకిస్తూ... అనుకోకుండానే ఆగి... చప్పుడు కానీయకుండా, బెట్టును నెమ్మదిగా వదలి... అడుగులు తడబడి, సడి చేయకుండా, గోడకు భుజం ఆనించి... ఉండిపోయినాడు:

"ఏమండీ... మీ... నేర్పు... నాకు... చేతనవుతుందా... ఏమో... అంత భాగ్యమా... రసైకజీవులు... ధన్యులు... మిమ్ములను ... ఎడబాయకుండా... చెంత ఉండడానికి... నోచుకున్నవారు... నావంటిదానికి... మనం... ఇద్దరం..."

-విన్నంతవరకూ... చాలదూ?... ఆశాసౌధములన్నీ... గిరగిర తిరిగి... నేలలో కలిసిపోయినవి. - ఇంకా... సందేహమా?... అయినా...

చీమ చిటుకు మన్నంతయినా ధ్వని కానీయకుండా... తలుపు తీసి, చూడలేక... చూడలేక చూసి... అర్థంకాక... తన కళ్ళను ఓమట్టున నమ్మలేక... పోయినాడు:

ఎదురుగా... సోఫాలో... ఒకరి మీద... ఒకరు తూలి... ఆమె... చిత్రకారుడు.

వెనుకవైపుగా ఉండటంచేత... అతని రాక వారికి.... పొడ కట్టలేదు.

కృత్రిమ తన్మయత్వం... దర్పణంలో ప్రతి ఫలించిన... యజమాని దీనమూర్తిని... కనబడ నీయలేదు. ఐనా... లక్ష్యం చేసే... స్థితిలో ఉన్నారా...

-అలా... అలా... జారుతూ... పట్టు దప్పి... నిరీహతో కూలిపోయినాడు-... ఎండమావులను... దివ్యోదపూరములని... అత్యాశతో... డాయబోయి... పోయి... చివరకు... హతాశుడైన... పాంథునిలాగు... ■